www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 18 జనవరి 2023
5
ఏలూరు



19 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల, గుండుగొలనులో ఈనెల 19వ తేదీ నుంచి 24 వరకూ ఆధార్ మొబైల్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. ఈ మేరకు ఆధార్ మొబైల్ క్యాంపెయిన్ ప్రయోజనాలపై పాఠశాల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులను కోరారు. పంచాయతీల్లో పనిచేయడానికి వచ్చే ఆధార్ ఆపరేటర్లకు ఇద్దరు వాలంటీర్లను, ఇద్దరు గ్రామ సచివాలయ సిబ్బందిని సహాయకులుగా ఏర్పాటు చేయాలని సూచించారు. 19, 20, 21, 22, 23, 24 తేదీల్లో పూళ్ల 1, 2, 3 సచివాలయాల్లోనూ, గుండుగొలనులో 19, 20 తేదీల్లో శ్రీవిద్యాలయ పాఠశాల వద్ద, 21, 23, 24 తేదీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆధార్ మొబైల్ ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

వికృత క్రీడకు విలవిల..!

యథేచ్ఛగా పండుగ మూడు రోజులు కోడి పందేలు

రెండు జిల్లాల్లో రూ.వందల కోట్లు బెట్టింగ్

ఆర్థికంగా దెబ్బతిన్న సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం


కోర్టులను ఏమార్చేందుకు పోలీసుల సరికొత్త ఎత్తుగడ

పలువురు సిఐలు, ఎస్ఐలకు ఛార్జిమెమోలు ఇచ్చేందుకు రంగం సిద్ధం

ప్రభుత్వ తీరుపై సర్వత్రా విస్మయం

'పశ్చిమగోదావరి జిల్లాలోని ఓ మండలానికి చెందిన రైతు పొలం పెట్టుబడికి అని రూ.50 వేలు అప్పుతెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. ఊరువాడా కోడిపందేలు జరగడంతో చూసేందుకు వెళ్లిన సదరు రైతు ఆకర్షితుడై పందేలు కాశాడు. పెట్టుబడికి తెచ్చిన డబ్బంతా పందేల్లో పోవడంతో.. ఇంటికి వెళ్లలేక దిక్కుతోచని పరిస్థితిలో మానసికంగా కుంగిపోయాడు.'

'ఏలూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దాళ్వా నాట్లు పనులకు వెళ్లి కుటుంబమంతా కష్టపడిన కూలి పని సొమ్మును పండుగ ఖర్చులకు అని దాచుకున్నాడు. కుమార్తెలు, అల్లుళ్లను పండుగకు పిలిచాడు. పండుగ అయిపోయి వెళ్లేటప్పుడు బట్టలు పెట్టాలనుకున్నాడు. అయితే కోడిపందేల్లో ఉన్న సొమ్మంతా పోవడంతో ఏం చేయాలో తెలీని పరిస్థితి నెలకొంది. విషయం తెలిసి ఆ కుటుంబమంతా తీవ్ర వేదనలో మునిగిపోయింది.'



పైనపేర్కొన్న ఇద్దరే కాదు.. రెండు జిల్లాల్లోనూ వేలాది కుటుంబాలు వికృత క్రీడ కోడిపందేలకు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. మరోసారి కోడి పందేలకు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకమే బలిపశువులుగా మారిన పరిస్థితి నెలకొంది. సంప్రదాయం ముసుగులో జరుగుతున్న కోడి పందేలకు ప్రతియేటా ఎన్నో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నా ప్రభుత్వాలకు, అధికారులకు పట్టడం లేదు. కోడిపందేలకు అడ్డుకట్ట వేయాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ఆగని పరిస్థితి నెలకొంది. పందేలను అడ్డుకుంటామని భోగిపండుగ ముందురోజు వరకూ బీరాలు పలుకుతున్న పోలీసులు పండుగ మూడురోజులు మాత్రం పత్తాలేకుండా పోతున్నారు. ప్రభుత్వ అనధికార ఆదేశాలతో కోడిపందేలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ 47 మండలాలు ఉండగా ప్రతి మండలంలోనూ పది బరులకు తక్కువ కాకుండా కోడి పందేలు జరిగిన పరిస్థితి ఉంది. దాదాపు 470 బరుల్లో కోడి పందేలు సాగినట్లు తెలుస్తోంది. మూడు రోజుల్లో దాదాపు రూ.200 కోట్లకుపైగా బెట్టింగుల రూపంలో చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు. కోడిపందేల బరుల వద్ద గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. ఎంఎల్ఎలే దగ్గరుండి కోడిపందేలు నిర్వహించిన పరిస్థితి నెలకొంది. తమ గ్రామాల్లోనే కోడిపందేలు జరుగుతుండటంతో చూసేందుకు వెళ్లిన ఎంతోమంది సామాన్య ప్రజానీకం జేబులు గుల్ల చేసుకున్న పరిస్థితి ఏర్పడింది. ఎంతోమంది చిరుద్యోగులు, రైతులు, కూలీలు, కార్మికులు ఇలా ఎన్నో కుటుంబాలు కోడిపందేలతో ఆర్థికంగా కుదేలైన పరిస్థితి నెలకొంది. పిల్లల ఫీజులకు అని తెచ్చిన డబ్బు, ఆసుపత్రి ఖర్చులకు దాచుకున్న సొమ్ము, పొలం పెట్టుబడుల కోసం తెచ్చుకున్న డబ్బుతోసహా పోగొట్టుకుని ఎంతోమంది రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడింది. బైండోవర్ కేసులు, బరుల ధ్వంసం పేరుతో హడావుడి చేసిన పోలీసులు పండుగ మూడు రోజులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. రాత్రీ పగలు తేడా లేకుండా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పందేలు సాగాయి. బరుల ప్రాంతాలన్నీ జాతరను తలపించాయి. వాహనాలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. అయినప్పటికీ పందేలను అడ్డుకున్న నాథుడు లేకుండాపోయాడు. రాజకీయంగా లాభం చేకూరుతుందని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలే పందేలను ప్రోత్సహిస్తూ సామాన్యుల జీవితాలతో ఆడుకుంటున్నారు. మంగళవారం పందేలు ఆగినప్పటికీ మూడు రోజులు సాగిన పందేలతో ఎంతోమంది జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. వికృత జూద క్రీడకు చిన్న, పెద్ద తేడా లేకుండా ఆకర్షితులై వ్యసనపరులుగా మారుతున్నారు.

కోర్టులను ఏమార్చేందుకు ఎత్తుగడలు..!

పండుగ మూడు రోజులు కోడి పందేలకు అడ్డుకట్ట వేయకుండా పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. కోర్టులను ఏమార్చేందుకు మాత్రం ఇప్పుడు రెండు జిల్లాల్లోనూ పలువురు సిఐలు, ఎస్ఐలకు ఛార్జిమెమోలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. తొలిరోజు కోడిపందేలతోపాటు గుండాట, పేకాట, మూడు ముక్కలాటకు సైతం అనుమతిచ్చేశారు. రెండో రోజు గుండాట, పేకాటను అడ్డుకోవాలంటూ కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. అయితే అప్పటికే గుండాట, పేకాట నిర్వాహకులు మామూళ్లు ఇవ్వడంతో వారిని అడ్డుకోలేదు. దీంతో గుండాట, పేకాటకు సంబంధించిన ఫొటోలతో మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తొలిరోజు కాకుండా మిగిలిన రెండు రోజులు గుండాట, పేకాట వంటి వాటిని అడ్డుకోలేదనే కారణంతో పలువురు సిఐలు, ఎస్ఐలకు ఛార్జిమెమోలు జారీ చేయనున్నట్లు తెలిసింది. బుధవారం రెండు జిల్లాల్లోనూ ఎంతమందికి ఛార్జిమెమోలు ఇచ్చేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పందేలను అడ్డుకోకపోగా ఈ విధంగా ఛార్జిమోమోల పేరుతో హడావుడి చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ తీరుపైనా చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదర్శప్రాయులు జ్యోతిబసు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పశ్చిమ బెంగాల్ సిఎంగా 23 ఏళ్ల పాలించిన సిపిఎం నేత జ్యోతిబసు ఆదర్శాలకు అనుగుణంగా సిపిఎం కార్యకర్తలు పనిచేయాలని పట్టణ నాయకురాలు ఎస్‌కె.సుభాషిణి అన్నారు. మంగళవారం జ్యోతి బసు వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతిని మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ నాయకురాలు ఎస్‌కె.సుభాషిని, జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆనంతరం సుభాషిణి మాట్లాడుతూ సిపిఎం నవరత్నాల్లో ఒక్కరైనా జ్యోతిబసు 23 ఏళ్ల పశ్చిమ బెంగాల్ సిఎంగా, పీపుల్ డెమోక్రసీ పత్రికా సంపాదకులుగా, ప్రజానేతగా, కార్మిక నాయకుడుగా ఎన్నో పోరాటాలు చేసి పారదర్శక పాలన అందించారని తెలిపారు. ఆయన వర్ధంతి సందర్భంగా, ఆయన ఆదర్శాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేసి చైతన్యవంతులు కావాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ ప్రజా సమస్యలపై పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అందుగుల ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, పి.దుర్గారావు, రాంబాబు పాల్గొన్నారు.

19 నుంచి విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కె.సంతోషరావు

ప్రజాశక్తి - విశాఖపట్నం

2023-24 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ ఛార్జీల (టారిఫ్)పై ఈ నెల 19వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) వారు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కె.సంతోషరావు తెలిపారు. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ సివి.నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో సభ్యులు ఠాకూర్ రాంసింగ్, పి.రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఎపిఇఆర్‌సికి సమర్పించిన వార్షిక ఆదాయ అవసర నివేదికలపై ఈ నెల 19, 20, 21 తేదీల్లో విశాఖపట్నంలోని తమ కార్పొరేట్ కార్యాలయంలో రోజు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారని తెలిపారు. ఎపిఇఆర్‌సి ప్రతిరోజూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను విశాఖపట్నం నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అభిప్రాయాలు చెప్పదలుచుకున్నవారు ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఎస్ఇ, లేదా ఇఇ ఆఫీస్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ ముందుగానే నమోదు చేసుకున్నవారి అభ్యంతరాలు, సలహాలు తెలిపిన తర్వాత, ఎపిఇఆర్‌సి అనుమతితో నమోదు చేసుకోనివారి అభిప్రాయాలు కూడా తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో..

అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థ జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో అవకతవకలు, అవినీతి ఆరోపణలపై ఇన్‌ఛార్జి కమిషనర్, జెసి పి.అరుణ్‌బాబు మంగళవారం విచారణ చేపట్టారు. కార్పొరేటర్ శ్రీనివాస్ చేసిన ఫిర్యాదుపై అరుణ్‌బాబు సంబంధిత విభాగాన్ని పరిశీలించారు. నెలకు రూ.మూడు లక్షల సంపాదన అంటూ గతంలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఫిర్యాదుకు సంబంధించిన పలు దస్త్రాలు పరిశీలించారు. పలువురిని విచారించారు. ఇక కార్పొరేషన్ వాహనాన్ని ఉద్యోగులు కొందరు అమ్మేసుకున్నారన్న ఆరోపణలపై కూడా విచారించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఇన్‌ఛార్జి కమిషనర్ పిఆర్ఒ తమ వద్ద బెదిరించి డబ్బులు వసూలు చేశారని, జనన, మరణ ధృవీకరణ పత్రాలు మంజూరు విభాగంలో ఒక ప్రయివేటు ఉద్యోగి ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఆయిల్ కుంభకోణంపై పలు ఆరోపణలొచ్చాయి. ఇప్పుడు వాహనన్నే అమ్మేశారన్న ఆరోపణలు గుప్పుమనడంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. నగరపాలక సంస్థలో జనన, మరణ ధృవపత్రాల మంజూరులో భారీ కుంభకోణమే వెలుగుచూసినట్లు తెలుస్తోంది. విచారణ విషయాలు వెల్లడించలేదు.



డ్రైవర్లకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

డ్రైవర్లకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జోషిరాయ్ వైద్య పరీక్షలు చేశారు. టోల్‌ప్లాజా సిబ్బందితో పాటు వాహనదారులు షుగర్, బిపి తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఔషధాలను అందజేశారు. రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా సోమవారం అర్ధరాత్రి దాటాక ప్రయాణాలు చేస్తున్న వాహనాలను ఆపి డ్రైవర్లకు ఫేస్‌వాష్ చేయించి, కాఫీ, టీలు అందించారు. ఈ వైద్య శిబిరంలో టోల్ ప్లాజా మేనేజర్ ఎస్‌కె ఇంతియాజ్, ఎన్‌హెచ్ కో ఆర్డినేటర్ ఫణి, ఎజిఎం రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.


పేకాట శిబిరాలపై విస్తృత దాడులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట శిబిరాలపై దాడులు చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివరాలను వెల్లడించారు. సంక్రాంతి సందర్భంగా జూదాలు నిర్వహించేవారిని కట్టడి చేసే క్రమంలో 70 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. యువత వ్యసనాల బారిన పడకుండా వాలీబాల్, షటిల్, కబడ్డీతో పాటు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. దాతల సహకారంతో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశామన్నారు. పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి 128 మందిని అదుపులోకి తీసుకున్నామని, 30 కేసులు నమోదు చేశామని, వీటితోపాటు 24 పందెం కోడి పుంజులు, రూ.59,260 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ధన్యజీవి కంది రాములు

ప్రజాశక్తి - ఏలూరు



రాములు (ఫైల్ ఫొటో)

రిక్షా కార్మికుడు, సిపిఎం సీనియర్ కార్యకర్త కంది రాములు(80) ధన్యజీవి అని సిపిఎం జిల్లా ఆర్గనైజర్ పిచ్చుక ఆదిశేషు అన్నారు. మంగళవారం స్థానిక పత్తేబాద శ్మశానవాటిక వద్ద జరిగిన రాములు సంతాప సభలో ఆదిశేషు మాట్లాడారు. తొలుత రాములు మృతికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. రాములు చితికి వారి కుమారుడు మోహన్ నిప్పంటించారు రాములుకు అక్షరజ్ఞానం లేకపోయినా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను తన రిక్షా ఎక్కిన ప్రయాణికులకు చెప్పేవారని తెలిపారు. పార్టీ ప్రారంభ దినాల నుండి పార్టీ, ప్రజా సంఘాలు ఇచ్చిన ప్రతీ పిలుపును అందుకుని పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేవారని ఆదిశేషు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ పార్టీ కార్యకలాపాలను నాయకులను అడిగి తెలుసుకుని పార్టీపై అంచలంచల విశ్వాసం కలిగిన రాములు ధన్యజీవులని వారి ఆశయ సాధన కోసం పనిచేయడమే వారికి నిజమైన నివాళులని ఆదిశేషు తెలిపారు. కంది రాములు మరణవార్త తెలిసిన వెంటనే ఆదిశేషు స్థానిక తిలక్ నగర్లోని వారి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి నూలు దండ వేసి జోహార్లు అర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కంది విశ్వనాథం, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, నగర కమిటీ సభ్యులు బుగత జగన్నాథరావు, వి.సాయిబాబు, సిపిఎం నాయకులు దుర్గారావు, మీసాల అప్పారావు, గుడిపూడి రమణ, అంతవరపు శివ, గొర్రెల శీను, కంది గోపి, పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం రాములు స్వగృహం నుండి శ్మశాన వాటిక వరకూ అంతిమయాత్ర చేపట్టారు.

ఆర్‌టిసి బస్సు లేక ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం నుండి జిల్లా కేంద్రం ఏలూరుకు ఆర్‌టిసి బస్సు లేక ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నానాఅవస్థలు పడుతున్నారు. గణపవరం నుండి గతంలో భీమవరం డిపో నుండి ఏలూరు వెళ్లడానికి ప్రతీరోజు ఉదయం, సాయంత్రం రెండు బస్సులు నడిపే వారు. ఒక బస్సు నిడమర్రు, నారాయణపురం మీదుగా ఏలూరు వెళ్లేది. మరో బస్సు పత్తేపురం మీదుగా ఏలూరు చేరుకునేది. ఆ సమయంలో గణపవరం, నిడమర్రు, ఉండి మండలాల్లోని 52 గ్రామాలకు చెందిన ప్రజలకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. వ్యాపారస్తులు నిత్యం ఏలూరు నారాయణపురం, తాడేపల్లిగూడెం తమ వ్యాపార నిమిత్తం వెళ్లడానికి వీలుగా ఉండేది. అయితే ఆర్‌టిసి అధికారులు ఆకస్మాత్తుగా ఏలూరు వెళ్లే బస్సులను రద్దు చేశారు. దీంతో ప్రజలు ఏలూరు వెళ్లాలంటే నానాఅవస్థలు పడుతున్నారు. నిడమర్రు మండలంలో తోకలపల్లి, ఆముదాలపల్లి, పత్తేపురం గ్రామాలకు చెందిన విద్యార్థులు నారాయణపురంలో ఉన్న కాలేజీకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు జిల్లా కేంద్రం కావడంతో ఉంగుటూరు నియోజకవర్గంలో నిడమర్రు, గణపవరం మండలానికి చెందిన ప్రజలకు ఏలూరులో జిల్లా కోర్టు ఇతర పనులు అధికం కావడంతో నిత్యం ఏలూరు వెళ్లే ప్రయాణికులు సమయానికి బస్సు లేకపోవడంతో ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం చేయాల్సి వస్తుంది. ప్రయివేటు వాహనదారులు ఆర్‌టిసి బస్సు రేటు కన్నా అధికంగా సొమ్ములు వసూలు చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఏలూరుకు బస్సులు నడపాలని వారు కోరుతున్నారు.

50 గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు

రుద్రరాజు వెంకట సూర్యనారాయణ రాజు(ఆర్‌విఎస్.రాజు)

ఆర్యవైశ్య వర్తకసంఘ భవనం అధ్యక్షులు



50 గ్రామాలకు కేంద్రంగా ఉన్న గణపవరం నుండి జిల్లాకేంద్రం ఏలూరుకు ఆర్‌టిసి బస్సు లేకపోవడం బాధాకరం. ప్రయాణికులు నానాఅవస్థలు పడుతున్నారు. ప్రయివేటు వాహనాల దోపిడీకి అల్లాడిపోతున్నారు. వెంటనే బస్సు ఏర్పాటు చేయాలి. కొల్లేరు ప్రాంత గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏలూరుతోపాటు హైదరాబాదుకు గణపవరం మీదుగా బస్సు నడపాలి.

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు

వంకాయల రామారావు


మానవత మండల అధ్యక్షుడు



భీమవరం డిపో నుండి గణపవరం మీదుగా ఏలూరు వెళ్లే బస్సులను ఆర్‌టిసి అధికారులు రద్దు చేయడం దారుణం. ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బస్సులు నడపాలి.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - గణపవరం



ముగ్గుల పోటీలో మహిళలు

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు, అప్పనపేట ఉపసర్పంచి నూకారపు సుధాబాబు అన్నారు. సంక్రాంతి ముత్యాలమ్మ జాతర సందర్భంగా మంగళవారం అప్పనపేట పంచాయతీ శివారు గ్రామమైన మల్లపరాజుపేటలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో పండుగ, గ్రామ దేవతల జాతర్ల సందర్భంగా యువతీ యువకులకు ఆటల పోటీలు నిర్వహిస్తే వారికి క్రీడల పట్ల ఆసక్తి కలిగించడానికి ఆటల పోటీలు ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న రాజకీయాల పట్ల అవగాహన కలిగి ఉండా లన్నారు. గ్రామంలో నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నక్కా శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు పివిఆర్.సుబ్రహ్మణ్యం, కేతా శ్రీనివాస్ ఎస్.సంజీవరావు పాల్గొన్నారు

మృత్యు 'దారులు'

గజానికో గొయ్యి

ప్రమాదకరంగా రోడ్లు

ప్రయాణికులు, ప్రజలకు తప్పని అవస్థలు

పట్టించుకోని ప్రభుత్వం

ఇదీ ముదినేపల్లి మండలంలోని రహదారుల దుస్థితి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఏ రోడ్డు చూసిన ప్రమాదకరంగా తయారయ్యాయి. వీటిపై ప్రయాణించాలంటేనే ప్రజలు, వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. రోజులో పది ప్రమాదాలు, వారానికి ఇద్దరు ఈ రోడ్లపై మృత్యువాత పడుతున్నారు. ఇంటి నుంచి వాహనంపై బయటకు వెళ్తే తిరిగి ఇంటికి క్షేమంగా వస్తామనే నమ్మకం లేకుండా పోయింది. అత్యంత ప్రమాదకరంగా రోడ్ల పరిస్థితి మండలంలో ఉంది. మండలంలోని అన్ని అర్అండ్‌బి, జెడ్‌పి, గ్రామీణ ప్రాంతాల రోడ్లు మృత్యుకుహరాలుగా మారాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. గజానికో గొయ్యి పడి అధ్వానంగా ఉన్నాయి.

పామర్రు-కత్తిపూడి 165 జాతీయ రహదారిలో ముదినేపల్లి నుంచి పెదపాలపర్రు వరకూ రోడ్డు ఆద్యాంతం గుంతలమయమై ప్రమాదభరితంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణం చేయలంటే వాహనదారులు, ప్రయాణీకులు హడలిపోతున్నారు. సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా ఉంది. ముదినేపల్లి నుంచి గుడ్లవల్లేరు వెళ్లే రోడ్డు 12 కిలోమీటర్ల మేర పూర్తిగా ధ్వంసమైంది. గుడ్లవల్లేరు వరకూ గంతలుపడి ప్రయాణానికి ఏ మాత్రమూ అనువుగా లేదు. ముదినేపల్లి నుంచి వడాలి మీదుగా చిగురుకోట వెళ్లే రహదారి అత్యంత ప్రమాదకరంగా ఉంది. సూమారు 13 కిలో మీటర్ల మేర రోడ్డు పెద్దపెద్ద గుంతలతో దారుణంగా ఉంది. ఈ రోడ్డులో గుంతలతో పాటు ప్రమాదకర మలుపులు ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. సింగరాయపాలెం నుంచి వడ్లమానూరు వెళ్లే రోడ్డు భారీగోతులతో అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. అదేవిదంగా సింగరాయపాలెం నుంచి కోరుకొల్లు వెళ్లే రోడ్డు అత్యంత ప్రమాదభరితంగా తయారైంది. ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అనేక మంది మృత్యువాత పడుతున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు దేవపూడి, వాడవల్లి, కోడూరు, పేరూరు, వైవాక, వణుదుర్రు, ఊటుకూరు, వి.రావిగుంట గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్లపై నిత్యం ఏదోఒక చోట ప్రమాదం జరుగుతూ ఉంది. అనేక మంది క్షతగాత్రులవుతున్నారు. మరికొంత ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ఈరోడ్లలో మట్టి టిప్పర్లు, ఆర్‌టిసి బస్సులు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, లారీలు వంటి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గోతుల్లో పడి పల్టీలు కొట్టడం, ఎదురెదురుగా ఢీకొనడం, గుంతలను తప్పంచోయి కాల్వల్లో పడిపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల విశ్వనాద్రిపాలెం వద్ద గొయ్యిని తప్పించబోయి ఆర్‌టిసి బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చేవూరుకు చెందిన నిమ్మగడ్డ నాని తీవ్రంగా గాయపడ్డాడు. గతనెలలో గుడివాడ రోడ్డులో చినపాలపర్రు వద్ద గోతుల కారణంగా టిప్పర్-ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో టిప్పర్ డ్రైవర్, ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో సహా 10 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఇలా అనేక ప్రమాదాలు ఈ రోడ్లపై జరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి రోడ్లు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న వైవాక-కొచ్చెర్ల రోడ్డు



అధ్వానంగా ఉన్న దాకరం-పుట్లచెరువు ఆర్అండ్‌బి రోడ్డు

శ్రీనివాస్ మృతి బాధాకరం


శ్రీనివాస్ (ఫైల్)

ప్రజాశక్తి - మండవల్లి

ప్రముఖ చిత్రకారులు, పర్యావరణ ప్రేమికులు చెన్నంశెట్టి శ్రీనివాస్ మృతి బాధాకరమని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్, బిసి సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగునెను వరప్రసాద్ అన్నారు. విజయవాడలోని శ్రీనివాస్ నివాసం వద్ద ఆయన మృతదేహాన్ని పలువురితో కలిసి పరామర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు తండ్రి మిఠాయి కొట్టు సీతారామయ్య అంటే మండవల్లి మండలంలో తెలియని వ్యక్తులు ఉండరన్నారు. సీతారామయ్య రెండో కుమారుడు శ్రీనివాస్ ఆర్టిస్టుగా విజయవాడలో స్థిరపడి వంశీ యాడ్స్ ప్రారంభించి పబ్లిసిటీ రంగంలో పారిశ్రామికవేత్తగా ఎదిగారన్నారు. పర్యావరణంపై ఎంతో మక్కువ కలిగి ఉండేవారని, అంతేకాకుండా ప్రకృతి సేద్యంపై ఆకర్షితులై టెర్రస్‌పై గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు పండించి పలువురి అభినందనలతో పాటు అవార్డులు కూడా అందుకున్నారని గుర్తు చేశారు. పండించిన మొక్కలను, కూరగాయల గింజలను ఉచితంగా పంపిణీ చేసేవారన్నారు. అంతేకాకుండా సమాజంపై స్పృహ కలిగి ప్రజాసేవలో కొనసాగుతూ స్వగ్రామమైన మండవల్లిలో వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చడంతోపాటు పాఠశాలలో జరిగిన పలు కార్యక్రమాల్లో విద్యార్థులకు మెమొంటోలను తన వంతు బాధ్యతగా అందించేవారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబానికి ఓదార్పు కలుగ చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, టెంటు అప్పారావు, స్నేహితులు బావిశెట్టి స్వామి, జోజిబాబు, మణికంఠ పలువురు ప్రార్థించారు.


11న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి పెదవేగి, ముండూరు గ్రామంలో జాతీయ లోక్‌అదాలత్, వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేనెల 11వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి గోదావరి జిల్లాలో కూడా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్‌లో అన్ని రకాల సివిల్, కుటుంబ వివాదాల, వాహన ప్రమాద కేసులు, చెక్ బౌన్స్ కేసులు, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కేసులు, రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, బ్యాంకు లావాదేవీలు, మున్సిపల్ టాక్స్ కేసులు, అన్ని రకాల కేసులను రాజీ చేస్తామని చెప్పారు. దీనిపైన అవగాహన కలిగించేందుకు ఈ న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జిఆర్.మనోజ్, గ్రామ కార్యదర్శి బాబ్జీ, మహిళా పోలీసు రాజేశ్వరి, గ్రామవైస్‌ప్రెసిడెంట్ అన్నపనేని నాగ వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్కౌంటెంట్ దుర్గారావు మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


దుర్గారావు (ఫైల్)

పట్టణంలో ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ పాలడుగుల వెంకటసత్యదుర్గారావు అనారోగ్యంతో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన అకౌంటెంట్స్ అసోసియేషన్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని ఆడిటర్లు, వ్యాపారవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే దుర్గారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేరాలు - ఘోరాలు


పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు
నలుగురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - చాట్రాయి

రహదారిపై గుంతల కారణంగా కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన చాట్రాయి- పోలవరం రహదారిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బూరుగుగూడెం గ్రామానికి చెందిన ఆదికేశవరెడ్డి తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కారులో సంక్రాంతి పండుగ సందర్భంగా వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి కారులో మంగళవారం బూరుగుగూడెం బయలుదేరారు. ఈ క్రమంలో చాట్రాయి- పోలవరం రహదారిలో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జు అయింది. ఆ సమయంలో ఆ రహదారిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఇది గమనించి కారులో ఉన్న వారిని బయటికి తీసి ఆసుపత్రికి తరలించారు.

ఈ రహదారిలో నిత్యం భారీ లోడుతో చిప్స్ లోడు లారీలు తిరగడం వల్ల రోడ్లు గుంతలు పడి ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రదేశంలోనే గత నెల రోజుల్లోనే నాలుగు సార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పటికీ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను చాట్రాయి, పోలవరం గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ స్పందించడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అధిక లోడుతో వెళ్తున్న చిప్స్ లారీలను ఆపి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వెంకటలక్ష్మి మృతదేహానికి శవ పంచనామా పూర్తి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

దాట్లవారిగూడెంలో గత ఐదు రోజుల క్రితం హత్యకు గురైన మహిళ సున్నం వెంకటలక్ష్మి మృతదేహానికి మంగళవారం శవ పంచనామా స్థానిక తహశీల్దార్ ఎలీషా ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి నుంచి ఇద్దరు డాక్టర్లతో నిర్వహించారు. ఈ సంఘటనకు సంబంధించి వెంకటలక్ష్మిని హత్య చేసిన నిందితుడు మొడియం లక్ష్మణరావును పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్లు ఎస్ఐ చంద్ర శేఖర్ తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అంకన్నగూడెం పంచాయతీ పరిధిలోని దిబ్బగూడెంలో ఎస్ఇబి సిఐ మణికంఠ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీల్లో తెలంగాణ మద్యం పట్టుబడింది. దిబ్బగూడేనికి తరలిస్తున్న 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని మణికంఠరెడ్డి తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని, కొర్రి రామారావు, సనగం ప్రతాప్‌ను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.

సమయపాలన లేని పుట్రేపు బస్సు

ఎప్పుడొస్తుందో, అసలు రాదో తెలియని పరిస్థితి
మరమ్మతులకు గురవుతున్న వైనం
ప్రయాణికుల ఇక్కట్లు



బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం నడిపిస్తున్న ఆర్‌టిసి బస్సు సమయపాలన లేకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పల్లె ప్రాంతవాసులు దూర ప్రాంతాల ప్రయాణాల కోసం ఆర్‌టిసి బస్సు ప్రయాణం క్షేమమని ఆ బస్సులను ఆశ్రయిస్తుంటారు. కొందరు విద్యార్థులు సైతం పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లేందుకు ప్రభుత్వ బస్సులపై ఆధార పడుతుంటారు. ఈ క్రమంలో బస్సులు సమయానికి రాక పోవడంతో బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. అందుకు ఉదాహరణ పుట్రేపు ఆర్‌టిసి బస్సు అని చెప్పవచ్చు. బస్సు సమయాన్ని మార్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


పుట్రేపు బస్సు

జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో నుంచి ఆర్‌టిసి బస్సు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం లక్ష్మీపురం మండలంలోని అప్పలరాజుగూడెం, బండివారిగూడెం పుట్రేపు, టి.నరసాపురం మీదుగా చింతలపూడి వెళ్లి తిరిగి జంగారెడ్డిగూడెం డిపోకు వెళ్తుంది. ఈ క్రమంలో ఉదయం ఎనిమిది గంటలకు పుట్రేపు చేరాల్సి ఉంటుంది. అదేవిధంగా సాయంత్రం 3.45కి రావాల్సి ఉంది. ఈ క్రమంలో బండివారిగూడెం, రుద్రకోట రాజుగూడెం, కాపుగూడెం, పుట్రేపు తదితర గ్రామాల ప్రజలకు ప్రయాణానికి ఇతర ప్రయాణ సౌకర్యం లేకపోవడంతో ఆర్‌టిసి బస్సు ఆధారం. అదేవిధంగా అనారోగ్య బాధితులు ఆసుపత్రులకు జంగారెడ్డిగూడెం వెళ_ంటారు. ఈ క్రమంలో బస్సు సమయానికి రాక బస్సు కోసం ప్రయాణికులు, విద్యార్థులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళలో చింతలపూడి వెళ్లిన ఆర్‌టిసి బస్సు తిరిగి ఐదు గంటలకల్లా వచ్చేది. అయితే ఇప్పుడు ఆరు గంటలకు వస్తోందని దీంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాక కొన్ని సమయాల్లో బస్సు మరమ్మతులకు గురై సర్వీసులను అధికారులు పూర్తిగా రద్దు చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో బస్సు కోసం ఎదురు చూసే వారికి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలు చెబుతున్నారు. పలుమార్లు ఆర్‌టిసి డిపో అధికారులకు సమస్యను విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని వారు అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పుట్రేపు బస్సు ఉదయం, సాయంత్రం సమయానికి అనుకూలంగా వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


కృష్ణస్వామికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

గణపవరం తహశీల్దార్‌గా కృష్ణస్వామి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం తహశీల్దారుగా కృష్ణస్వామి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నిడమర్రు డిప్యూటీ తహశీల్దార్‌గా ఉన్న కృష్ణస్వామి ఉద్యోగోన్నతిపై తహశీల్దార్‌గా వచ్చారు. ఇప్పటివరకూ ఇన్‌ఛార్జి తహశీల్దారుగా ఉన్న ఎం.సన్యాసిరావు ఏలూరు కలెక్టరేట్‌కు సీసీగా బదిలీ అయ్యారు. కృష్ణస్వామిని ఎం.సన్యాసిరావు, ఆర్ఐ వెంకటేశ్వరరావు, విఆర్ఒ ఆకుల ప్రసాద్, కార్యాలయం సిబ్బంది, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.


17 నుంచి సిపిఐ పోరుబాట

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల లబ్ధిదారులకు రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ లబ్ధిదారులచే సంతకాల సేకరణ చేపట్టి రెవెన్యూ అధికారులకు వినతులు అందించేందుకు 'సిపిఐ పోరుబాట' చేపడుతున్నామని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ పోరుబాట గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో పేదలకు ప్రభుత్వమే ఉచితంగా ఇల్లు నిర్మించి ఇస్తామని పేర్కొందన్నారు. నేడు ప్రభుత్వం మాట తప్పి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న లక్షా 80 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి ఇల్లు నిర్మించుకోమని లబ్ధిదారులను కోరుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతీ లబ్ధిదారుడికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, కురెళ్ల వరప్రసాద్, గేదెల నాగేశ్వరరావు, ఎం.విజయ, పోలా భాస్కర్, చింతల దాలి నాయుడు, కనకం జగన్, జి.స్వాతి, కాశీ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి



మృతుని భార్యకు సాయం అందిస్తున్న మనోజ్

ఎడ్లబండిపై నుంచి జారి కిందపడిన ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్యవిద్యార్థిని అంబుల వైష్ణవి మంగళవారం సాయం అందించారు. కృష్ణాజిల్లా పామర్రు మండలం పెదమద్దాలికి చెందిన పేర్ల ఖాశింవల్లి (28)ఇటీవల ఎడ్లబండిపై నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ముదినేపల్లికి చెందిన అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్‌తో కలిసి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.ఐదు వేల నగదు, నిత్యవసర వస్తువులను మృతుని భార్యకు అందించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి ఐదేళ్ల వయస్సున్న పెద్ద కుమార్తె బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. బాధిత కుటుంబానికి కలిదిండికి చెందిన డాక్టర్ మస్తాన్‌వల్లి రూ.ఐదు వేల నగదు, ముదినేపల్లికి చెందిన జిలానీ రూ.వెయ్యి అందించారు. ఈ సందర్భంగా వైష్ణవి ముదినేపల్లిలో మాట్లాడుతూ మానవాత దృక్పథంతో దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు.

జివి మాల్ లక్కీ డ్రా

మొదటి బహుమతిగా కారు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



లక్కీ డ్రా తీస్తున్న జీవీ మాల్ యాజమాన్యం

స్థానిక జీవీ మాల్ నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలు ఆల్టో కారు, మూడు టివిఎస్ జ్యుపిటర్ స్కూటీలు కైవసం చేసుకున్నారని యాజమాన్యం చెరుకూరి జనార్ధన్, బాలు తెలిపారు. జీవీ ఆవరణలో వినియోగదారులకు మంగళవారం లక్కీ డ్రా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అబ్బిన దత్తాత్రేయ, డాక్టర్ కాకర్ల రామచంద్రరావు, డాక్టర్ చామర్తి శివరామ్‌కుమార్, డాక్టర్ అట్లూరి హర్షవర్ధన్ పాల్గొన్నారు. ఈ క్రమంలో మొదటి బహుమతి ఆల్టో కారు లక్కీ డ్రా విజేతను ప్రముఖులు అబ్బిన దత్తాత్రేయ ప్రకటించారు. కారును పట్టణానికి చెందిన కల్కి మిల్క్ స్టార్ బాలకృష్ణ గెలుచుకున్నారని తెలిపారు. మరో మూడు స్కూటీలను కిషోర్, రాజు, మహేంద్ర గెలుచుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జీవీ మాల్ యాజమాన్యం జనార్ధన్, బాలు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం వంటి మెట్ట ప్రాంతంలో జీవీ మాల్ వస్త్ర వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న వినియోగదారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో జీవీ మాల్ వస్త్ర ప్రభంజనంలో భాగంగా మూడు పండుగలు ఆరు వారాలు కార్యక్రమంలో ఆరు కార్లు, 12 స్కూటర్లకు లక్కీ డ్రా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ క్రమంలో జంగారెడ్డిగూడెం బ్రాంచ్‌కు ఒక కారు, మూడు స్కూటర్లు కేటాయించి లక్కీ డ్రా విజేతలకు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకి శ్రీనివాస, మల్లికార్జునరావు, కంచర్ల సతీష్, జీవీ మాల్ సిబ్బంది, కారు విజేత బాలకృష్ణ, స్థానిక ప్రముఖులు, వినియోగదారులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ముసునూరు

తమ చదువుకున్న పాఠశాలకు ఎంతోకొంత సేవ చేయాలనే ఉద్దేశంతో చక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం మండలంలోని చక్కపల్లి శ్రీమాదల శేషయ్య జెడ్‌పి హైస్కూల్లో 1990-1995 బ్యాచ్‌కి చెందిన 200 మంది పూర్వ విద్యార్థులు ఆత్మయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి సాంబశివరావు, అన్నవరపు బాలు, కొండపర్వ శ్రీనివాసరావు, మేక దీపక, సముద్రాల రత్నమాల, మిట్టగూడెం బాబు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1983-84 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు అంతా హైస్కూల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి ఆటపాటలతో సందడి చేశారు. వారంతా గత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు చదువులు చెప్పిన గురువులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆనంతరం విందు అరగించి ఆనాటి జ్ఞాపకాలను తలచుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో 60 మంది పాల్గొన్నారు.

మద్ది ఆలయంలో అన్నదానం

జంగారెడ్డిగూడెం : మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి యాత్రికులు అధిక సంఖ్యలో తరలి వచ్చారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొం డలరావు తెలిపారు. మంగళవారం ఆలయానికి వచ్చిన యాత్రికుల్లో 1800 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అలాగే ఒక్క రోజు ఆదాయం రూ.88,302 సమకూరిం దని తెలిపారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్త బి.నాగలక్ష్మి, పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు సరిత విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - భీమడోలు

గణపవరం మండలం కొత్తపల్లి వేదికగా ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 18వ తేదీ బుధవారం నిర్వహించే లెజెండ్రీ బ్లడ్ క్యాంపును విజయవంతం చేయాలని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు భీమడోలులో మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వర్ధంతి పురస్కరించుకుని ఆయన సంస్మరణార్థం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో ఎన్‌టిఆర్ అభిమానులు, టిడిపి కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి సత్కరించాలని, సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.


నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

జగనన్న కాలనీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం హౌసింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీర్లతో కలిసి కైకలూరు జగనన్న గ్రీన్‌విలేజ్‌ను సందర్శించారు. లే అవుట్‌లో విద్యుత్ లైన్లు, ఇళ్ల నిర్మాణ పురోగతిని ఇంజినీర్లతో సమీక్షించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. కాలనీలో రెండు వైపులా 40 అడుగుల రోడ్‌ల ముఖ ద్వారాల వద్ద నిర్మిస్తున్న ఆర్చిల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డిఇఇ రామయ్య, హౌసింగ్ ఎఇ శేఖర్ పాల్గొన్నారు.

మండవల్లి సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సంబంధిత సేవలను నిర్వహిస్తున్నామని పోస్ట్ మాస్టారు సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ సంబంధిత మార్పులు చేర్పులు చేయించుకోవచ్చన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సేవలను పొందవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు కైకలూరు పెద్ద పోస్టాఫీస్ వద్ద ఆధార్ సేవలు అందించారని, ప్రస్తుతం అధికారుల ఆదేశాల మేరకు తిరిగి మండవల్లి పోస్టాఫీస్‌లో ఆధార్ సంబంధిత సేవలను పున:ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు.